

**సంక్రాంతి సంబురం** | మాదాపూర్‌లోని శిల్పారామంలో మంగళవారం గంగిరెద్దులు సందడి చేశాయి


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, బుధవారం 17 జనవరి 2024 | HYDERABAD




సీఐ క్రాంతికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

## ప్రొ.జయశంకర్ విగ్రహం ధ్వంసం

**ఎల్లమ్మబండలో ఘటన.. ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్ శ్రేణులు**

**అదే చోట మరో విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్**

**జగద్గిరిగుట్ట పోలీసులకు కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ ఫిర్యాదు**

మియాపూర్/ జగద్గిరిగుట్ట, జనవరి16 : ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ధ్వంసం చేసిన సంఘటన ఎల్లమ్మబండలో జరిగింది. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ రహదారిపై ఉన్న జయశంకర్ విగ్రహాన్ని మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేస్తుండగా స్థానికులు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకునేలోపే విగ్రహాన్ని కిందపడేసిన వ్యక్తి పగులగొడుతూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా ఎల్లమ్మబండ సమీపంలోని మహవీర్‌నగర్‌కు చెందిన గోవిందు(35) గా తేలింది. నిందితుడు కొంతకాలంగా మతిస్థిమితంలేక ప్రవర్తిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో నిందితుడిని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి పంపి కేసునమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎల్లమ్మబండలో ధర్నాకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆదే ప్రాంతంలో విగ్రహాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నెలరోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘటన జరగడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కేటీఆర్**

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనకు బాధ్యుడైన దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని మంగళవారం ఎక్స్ వేదికపై ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల ముందే విగ్రహాన్ని దుండగుడు ధ్వంసం చేశారని, దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డీజీపీని కేటీఆర్ కోరారు. తెలంగాణ సమాజమంతా ఎంతగానో గౌరవించుకునే ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ధ్వంసం చేయడం అత్యంత హీనమైన చర్య అంటూ దాడిని తీవ్రంగా ఖండించారు.




బాధితుడి వద్ద లభించిన నగదు అప్పగించిన 108 సిబ్బంది వెంకటేశ్


## 108 సిబ్బంది నిజాయితీ

అమీర్‌పేట్, జనవరి 16 : రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి వద్ద లభించిన నగదును నిజాయితీగా అప్పగించారు 108 ఆంబులెన్స్ సిబ్బంది. సోమవారం ఎర్రగడ్డ ఫ్లైఓవర్‌పై ఓ బైక్ యాక్సిడెంట్ జరిగింది. వెంటనే అక్కడికి చేరుకున్న 108 అత్యవసర సిబ్బంది ప్రమాదంలో గాయపడిన తిరుపతయ్య అనే బాధితుడికి ప్రథమ చికిత్స అందజేశారు. అదే సమయంలో అతడి వద్ద లభించిన రూ.68,500 నగదు, బైక్, సెల్‌ఫోన్‌లను తిరుపతయ్య బంధువులను పిలిచి అప్పగించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి, బాధితుడి వద్ద లభించిన నగదును అప్పగించిన 108 సిబ్బంది వెంకటేశ్, వెంకటరమణలను పలువురు అభినందించారు.

## 21న లవ్ మై ఇండీ డాగ్ షో

ముషీరాబాద్, జనవరి 16 : బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 21న పెంపుడు కుక్కల కోసం లవ్ మై ఇండీ డాగ్ షో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ అమల అక్కినేని ఒక ప్రకటనలో తెలిపారు. జంతు సంక్షేమ సంస్థల్లో ఒకటైన బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ రెండవ ఎడిషన్ ఇండీ డాగ్ షోను 21న దోమలగూడ రామకృష్ణ మిషన్ పక్కన ఉన్న చైతన్య విద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు జంతువులకు మెరుగైన ప్రపంచాన్ని సృష్టిచడం తమ ఉద్దేశ్యమని మార్స్ పెట్ కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి తెలిపారు.





## ఫ్యూజ్ పడిపోతే.. గంటవరకు కరెంట్ రాదు

కోతలు లేవంటూనే.. వాతలు

సమయం కోరుతున్న ఎమర్జెన్సీ

05 -10 నిమిషాల పనికి.. గంటల తరబడి అంతరాయం

ఫోన్లు లిఫ్ట్ చేయరు.. సమస్యను పరిష్కరించరు

అంధకారంలో మగ్గుతున్న కాలనీలు

క్షేత్రస్థాయిలో సిబ్బంది మధ్య కొరవడిన సమన్వయం

సమస్యను పట్టించుకోని లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : ఫ్యూజ్ పడిపోతే.. గంట వరకు కరెంట్ రాదు.. ఇది మహానగరంలో ప్రస్తుత పరిస్థితి. ఉన్నతాధికారులు చెప్పే దానికి.. క్షేత్ర స్థాయిలో జరిగే దానికి పొంతన లేకుండా పోయింది. అధికారులు ఎలాంటి కోతలు లేవని చెబుతున్నప్పటికీ.. సిబ్బంది మాత్రం వాతలు పెడుతూనే ఉన్నారు. సబ్ స్టేషన్ల నుంచి నిరంతరం నాణ్యమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వరకు సాఫీగా సరఫరా అవుతున్నప్పటికీ కాలనీల్లోని ఇండ్లకు మాత్రం చేరడం లేదు. కేవలం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉత్పన్నమవుతున్న సమస్యను పరిష్కరించడంలో విద్యుత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. మా కాలనీలో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని కాలనీల వాసులు ఫోన్లు చేస్తే స్పందించడం లేదు. ఒకవేళ స్పందించినా.. దాన్ని పునరుద్ధరించేందుకు విద్యుత్ సిబ్బంది గంటల తరబడి సమయం తీసుకుంటున్నారు. ఈ సమస్యను గ్రేటర్ పరిధిలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట ఎదుర్కొంటూనే ఉన్నారు.

**కొత్త కనెక్షన్లపైనే ఆసక్తి**

నగరంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మొత్తం 9 సర్కిళ్లు, వాటి పరిధిలో డీఈ ఆపరేషన్స్‌తో పాటు ఏడీఈ కార్యాలయాలు, సెక్షన్ కార్యాలయాలను సైతం ఏర్పాటు చేశారు. ప్రతి సెక్షన్ పరిధిలో క్షేత్ర స్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా హెల్పర్లు (ఆర్టిజన్స్) విధుల్లో ఉంటున్నా, విద్యుత్ అంతరాయం విషయంలో తలెత్తున్న సమస్యలపైన పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సెక్షన్ అధికారులు కొత్త కనెక్షన్‌లు ఇవ్వడంలో చూపుతున్న ఆసక్తిని విద్యుత్ సరఫరా విషయంలో చూపడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

## ఎమర్జెన్సీ బృందాలు తక్కువ

కాలనీల్లో ఆకస్మాత్తుగా కరెంటు పోతే పునరుద్ధరించేందుకు వినియోగదారులు సెక్షన్ కార్యాలయానికి ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ బృందాలకు ఫోన్ చేయాలని చెబుతున్నారు. ఎమర్జెన్సీ బృందాలకు చెబితే తాము వేరే ఫిర్యాదు వస్తే దాన్ని సరిచేస్తున్నామని, సమయం పడుతుందంటూ ఫోన్ పెట్టేస్తున్నారు. ప్రతి సెక్షన్ పరిధిలో ఉండే లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా ఉండే హెల్పర్లు విధుల్లో ఉంటున్నా.. సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా కోసం ఎమర్జెన్సీ బృందాలు వచ్చి సరిచేసే వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి క్షేత్ర స్థాయిలో నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఫ్యూజ్ పోతే దాన్ని సరిచేసేందుకు 10–15 నిమిషాలు పడితే, ఎమర్జెన్సీ బృందాలు రావడానికి మాత్రం గంటకు పైనే పడుతున్నదని ఫిర్యాదు దారులు వాపోతున్నారు. నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉండాల్సిన లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు సబ్ స్టేషన్ వద్ద, సెక్షన్ కార్యాలయాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నా వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కరెంటు లేదని ఫిర్యాదు వస్తే మాత్రం వెంటనే ఎమర్జెన్సీ టీమ్ ఉందని, వారికి చేయాలని సలహాలు ఇస్తున్నారే తప్ప, సమస్యను పరిష్కరించేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పసందైన స్వీట్.. ఎగిరిన కైట్

**పరేడ్‌లో ముగిసిన కైట్ ఫెస్టివల్**

**సుమారు 9లక్షల మంది సందర్శకులు హాజరు**

కంటోన్మెంట్, జనవరి 16 : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ సోమవారం ముగిసింది. ఈ మూడు రోజుల్లో నగర నలుమూలలకు చెందిన సుమారు 9లక్షల మంది సందర్శకులు ఫెస్టివల్‌ను తిలకించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముగింపు సందర్భంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ రమేశ్ నాయుడు, పర్యాటక శాఖ డైరెక్టర్ నిఖిల, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ దేశ విదేశాల నుంచి వచ్చిన కైట్ ఫ్లయర్స్‌తోపాటు కళా బృందాలకు నేతృత్వం వహించిన కళాకారులకు అవార్డులను అందజేసి, సత్కరించారు.







వివేక్ | కపిల్ దేవ్

## ప్రాణాలు తీసిన పతంగి

**వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి**

**ఒకరు లిఫ్టు గుంతలో పడి.. మరొకరు కరెంటు షాక్‌తో**

**పండుగపూట నగరంలో తీవ్ర విషాదం**

**పతంగుల సరదా.. పండుగ పూట విషాదం మిగిల్చింది. ఇద్దరు యువకులను బలితీసుకున్నది. పతంగి ఎగురవేస్తూ.. ప్రమాదవశాత్తు లిఫ్టు గుంతలో పడిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా.. మరో చిన్నారి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటనలు మధురానగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటుచేసుకున్నాయి.**

మైలార్‌దేవ్‌పల్లి / వెంగళరావునగర్, జనవరి 16 : కాటేదాన్ గణేశ్ నగర్ ప్రాంతానికి చెందిన సంతోష్, శ్రావంతిల కుమారుడు వివేక్(10) స్థానికంగా ఉన్న రవి బ్రిలియంట్ హై స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం వివేక్ గాలిపటం ఎగురవేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలకు చిక్కుకున్నది. పతంగిని తీసుకునే ప్రయత్నం విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రహ్మత్‌నగర్‌లో లిఫ్ట్ గుంతలో పడి

రహ్మత్‌నగర్‌కు చెందిన కపిల్ దేవ్(23) సోమవారం సాయంత్రం తన స్నేహితులలో స్థానికంగా ఉన్న ఐదు అంతస్థుల భవనంపైకి ఎక్కి పతంగులు ఎగురవేశారు. ఈ క్రమంలో 3వ అంతస్థులో మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన కలిప్‌దేవ్‌ను చికిత్స నిమిత్తం యూసుఫ్‌గూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే కపిల్ దేవ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ ఇక్బాల్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధూళి తగ్గించిన సంక్రాంతి

**సెలవులకు పల్లెబాట పట్టిన నగరం**

**బోసిపోయిన రోడ్లు.. తగ్గిన వాయుకాలుష్యం**

**పీసీబీ ప్రామాణికం కంటే తక్కువ పరిమాణంలో..**

**గాలిలో సూక్ష్మ ధూళి కణాలు**

**పలు ప్రాంతాల్లో 90లోపే నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్**

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ) : నిత్యం వేలాది వాహనాల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయ్యే నగర వాసులు సంక్రాంతి సెలవులతో ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో వాహనాల రద్దీ తగ్గడంతో గాలిలో సూక్ష్మ ధూళి కణాల తీవ్రత భారీగా తగ్గింది. దీంతో పీసీబీ సూచించిన ప్రామాణిక విలువల కంటే తక్కువగా గాలి నాణ్యత సూచిక ఉంది. 12 నుంచి సంక్రాంతి సెలువులు రావడం, వెంటనే వీకెండ్ కూడా కలిసి రావడంతో వాహనాలు, పరిశ్రమలు పూర్తిగా మూసివేశారు. దీంతో నగరంలో గాలి నాణ్యత మెరుగుపడిందని పీసీబీ వర్గాలు పేర్కొన్నాయి.

### 14 ప్రాంతాల్లో మానిటరింగ్

నగరంలో మొత్తం 14 ప్రాంతాల వారీగా గాలి నాణ్యత, కాలుష్య తీవ్రతను టీఎస్‌పీసీబీ మానిటరింగ్ చేస్తున్నది. ఈ క్రమంలో వాహనాల రద్దీ, జన సంచారం, పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నది. దీని ద్వారా గాలిలో రసాయనాలతోపాటు, సూక్ష్మ ధూళి కణాల తీవ్రతను బట్టి గాలి నాణ్యత లెక్కిస్తున్నది. ముఖ్యంగా నెహ్రూ జువాలజికల్ పార్కు, పాశ మైలారం, ఇక్రిసాట్ పరిసర ప్రాంతాల్లో గడిచిన మూడు నెలలుగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ లెవల్స్ దారుణంగా పడిపోయినట్లుగా తేలింది. గడిచిన కొంత కాలంగా నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో విపరీతమైన మార్పులు వస్తున్నాయి. వ్యక్తిగత వాహనాల రాకపోకలు పెరగడంతో కాలుష్య ఉద్గారాల తీవ్రత గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యం ఐదు రోజుల గాలి నాణ్యత సూచీలను పరిశీలించగా, మెరుగైన వాతావరణమే ఉందని పేర్కొన్నారు.



### మెరుగుపడిన వాతావరణం

నిజానికి వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పీఎం10, పీఎం2.5 కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కానీ గడిచిన నాలుగు రోజుల్లో 90 లోపే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. అత్యధికంగా సనత్‌నగర్(154), బేగంపేట్(152), బొల్లారం పటాన్‌చెరు(152), జూ పార్క్ (137), ఈసీఐఎల్(125)గా ఉంటే.. మిగిలిన ప్రాంతాలైన కోకాపేట్(86), నాచారం ఐలా(77), కొంపల్లి(86), ఆర్సీపురం(78), హెచ్‌సీయూ(78), సోమాజీగూడ(92)గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. గత మూడు రోజుల ఈ పరిమాణంలోనే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు అవుతుందని, వాహనాల రద్దీ తగ్గడం, సంక్రాంతి సెలవుల కారణంగా పరిశ్రమల కార్యకలాపాలు నిలిచిపోవడంతోనేనని పీసీబీ వర్గాలు పేర్కొన్నాయి.

### ఐదు రోజుల్లో పెరిగిన గాలి నాణ్యత

గత కొంత కాలంగా సెంట్రల్ పీసీబీ నిర్దేశించిన ప్రమాణాల కంటే గాలి నాణ్యత సూచీలు రెండింతలు ఎక్కువగానే ఉంది. దీంతో అత్యంత దారుణంగా గాలి నాణ్యత నమోదవుతుండగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారు కొంత ఇబ్బంది పడుతున్నారు. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో సగటున ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 120–200లోపు నమోదు అవుతుంది. ఇందులో అత్యధికంగా కాలుష్య తీవ్రత ఉన్న ప్రాంతాల్లో నెహ్రూ జూ పార్క్, పాశా మైలారం, ఇక్రిసాట్‌తోపాటు ఈసీఐఎల్, మలక్‌పేట్, జీడిమెట్ల ఎక్కువగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం వాహనాల రద్దీతోపాటు, పారిశ్రామిక కార్యకలాపాలే. గడిచిన మూడు నెలల కాల వ్యవధిలో వాతావరణంలో పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ పరిమాణం పరిమితికి మించి చేరుతున్న నేపథ్యంలో ఈ ఐదురోజులలో గాలి నాణ్యత పెరగడం నగరవాసులకు కొంత ఊపిరి పీల్చుకునేలా ఉంది.

